# వంకర బాటలు +

రచన :
శ్రీ ఉమాప్రసాద్.

నేఫా ప్రాంతము లోమారు మూల ప్రదేశం.

మిత్రద్రోహియైన చైనాదాడినుండి భారత స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి అక్కడ కొన్ని సైనిక శిబిరాలు నెలకొల్పబడ్డాయి.

అర్ధరాత్రి సమయం, నైరాశ్యం రాజ్యమేలుతోంది. మంచు వర్షంలా పడుతోంది. చీమ చిటుక్కుమన్నా వినిపించే చప్పుడు. మధ్య మధ్య పహారా జవానుల అరపులు.

అంత అర్ధరాత్రిలోకూడ ఒక జవాను మాత్రం ఉన్మత్తునివలె తనలో తాను గొణుక్కుంటూ నిలబడ్డాడు.

'భాయీ!'

'భాయీ!' ఈసారి గట్టిగా పిలవడంతో త్రుళ్ళిపడి వెనుతిరిగి చూశాడా జవాను. విచార నేత్రాలతో సానుభూతి చూపిస్తూ తన చెంత నిలబడ్డాడు మరొక జవాను. 'భాయీ! నేను నిన్ను యిక్కడకు వచ్చినప్పటినుండి చూస్తున్నా నీ కథ నా కర్థం కావడం లేదు. భాయీ! నీ విచారానికి కారణం నాతో చెప్పగూడదా?' జాలిగా ప్రశ్నించాడా రెండవ జవాను. మొదటి జవాను బాధగా తలవూపి 'చెప్తాను భానూ! చెప్తాను. నా విచారానికి కారణం చెప్పి నా హృదయంలోని భారాన్ని తొలగించుకొంటాను.'

నేను కాలేజీలో B.A. చదివేరోజులవి. మా క్లాసులో వేణు, శ్యాం అనే యిద్దరు మిత్రులుండేవారు. వేణు పెద్ద బిరుదులందుకొనక పోయినా బాగా పాడతాడు. అతని పాటకి తోడుగా శ్యాం వయోలిన్ వాయించేవాడు. వేణు గానానికి శ్యాం వయోలిన్ కు ప్రేక్షకులు తలలాడించవలసిందే.

ఒకరోజున వేణు, శ్యాంల ప్రోగ్రాం జరిగింది. అందులో చంచలత అనే మరొక విద్యార్థిని పాల్గొంది. వేణు తొలిచూపులోనే ఆమెను వలచాడు. కాని మనసులోనే తన ప్రేమను దాచుకొన్నాడు. ఆ రోజు రాత్రి శ్యాంకు హఠాత్తుగా తెలివివచ్చి అటు యిటు చూసాడు. వేణు కలవరింత వినబడింది. శ్రద్ధగా విని, చిరునవ్వుతో ప్రక్కమీదకు వాలాడు శ్యాం.

* * * *

ఆ రోజు శుక్రవారం అనుకొంటాను. క్లాసులో అందరి దృష్టి లెక్చరర్ వేపే వుంది. 'సార్' అనే పిలుపుతో అందరు అటు చూశారు. ప్యూన్ చేతిలో ఏదో చీటీ వుంది. లెక్చరర్ చీటీ అందుకొని 'వేణు! నిన్ను ప్రిన్సిపాల్ గారు పిలుస్తున్నారోయ్' అన్నారు. వేణు విస్మయంగా బయటకు నడిచాడు. మళ్ళీ క్లాసు మొదలయింది. శ్యాంకు మాత్రము ఆయన చెప్పేది వినబడడం లేదు. మనస్సంతా వేణుపైనే వుంది.

కాలేజీ వదిలారు. శ్యాం బయటకు వచ్చి చూస్తే స్టూడెంట్సు అందరినోట ఒకటేమాట 'వేణు డిబార్డ్', కాలేజీ అంతా అట్టుడికి పోయినట్లయింది. శ్యాం రూముకు బయలుదేరాడు. శ్యాం మస్తిష్కంలో యెన్నో ఆలోచనలు చెలరేగాయి. 'వేణు స్థితికి కారణం ఎవరు? తనా? చంచలతా? తను వేణు పేర్న

ప్రేమలేఖ వ్రాయకపోతే అతనికీ దుర్గతి పట్టేదికాదేమో? అసలు చంచలత తన సౌందర్యముతో అతనిని మురిపించకపోతే? వేణు ఆ లేఖను తాను వ్రాసినట్లు ఒప్పుకొన్నాడన్నమాట. హే భగవాన్! తప్పు చేసింది ఒకరు, ఫలితం అనుభవించేది మరొకరా? చేయని నేరం, కఠిన శిక్ష.'

రూము తాళం తీసాడు శ్యాం. గదిని చూసేసరికి ఒక్కసారిగా స్థంభించి పోయాడు. వేణు సామాను ఒక్కటి కూడా లేదు. ఎక్కడికి వెళ్ళినట్టు? ఆలోచిస్తున్న శ్యాం దృష్టి టేబుల్ మీద నున్న కవరుపై పడింది. ఆతృతగా అందుకొని చదివాడు.

నాలుగే నాలుగు ముక్కలు!

శ్యాం!

జరిగిన దానికి బాధపడకు. నాకింతే ప్రాప్తి. అమ్మ, నాన్నలకు తెలుపకు. తర్వాత వాళ్ళకి తెలుస్తుంది. ఈ విశాల ప్రపంచంలో ఎక్కడయినా నాకుచోటు దొరకకపోదు.

ప్రియ మిత్రుడు,

వేణు.

చలనం తప్పాడు శ్యాం.

× × ×

ఆ నాటి నుండి శ్యాం స్థితి పూర్తిగా మారిపోయింది. పిలిచినా పలుకడు. నాలుగు మాటలకు ఒకటే జవాబు. కాలేజీ తప్పితే రూము. యివే అతని గమ్యస్థానాలు. ఇక అతనికి కార్యక్రమాలు లేవు, వయోలిన్ లేదు. ఈ విషయం స్టూడెంట్సునే గాక లెక్చరర్సును గూడా బాధించింది.



కాలేజీ వదలడంతో శ్యాం బయటకు నడుస్తున్నాడు. ఎదురుగా ప్రిన్సిపాల్ గారు వస్తున్నారు. ప్రిన్సిపాల్ గారి పిలుపుతో పరధ్యాన్నంగా నడుస్తున్న శ్యాం ఆగాడు. మిత్రుని కోసం విచారిస్తున్న శ్యాంని చూసి ప్రిన్సిపాల్ గారి హృదయం ద్రవించింది. బాధతో శ్యాంను ఓదార్చారు. 'చూడుశ్యాం! రేపు మన కాలేజీడే. నీ వయోలిన్ వినాలని అందరూ అభిలాషపడుతున్నారు. శ్యాంకు యిష్టం లేకపోయినా ప్రిన్సిపాల్ గారి వత్తిడి వలన ఒప్పుకొనక తప్పలేదు.

కార్యక్రమం మొదలయింది. వయోలిన్ వినాలని ప్రేక్షకులు తదేకంగా శ్యాంవంకే చూస్తున్నారు. వాతావరణం స్థంభించినట్లనిపించింది. శ్యాం వయోలిన్ తీసుకొని రాగం ఆలాపించాడు. తన హృదయంలోని భారాన్నంతా తీగలపై ప్రసరింప జేసాడు. చేతి వ్రేళ్ళు అటు యిటు కదిలాయి! తీగలు భారంగా విషాద గీతికను ప్రయోగించాయి. ఆ విషాద గీతాన్ని విన్న ప్రేక్షకుల హృదయాలు భారంగా తయారయాయి. వారి కనుకొనల్లో నీరు నిలిచింది. బహుమతి ప్రధానంలో శ్యాంను పిలిచారు. కాని శ్యాం ఆ సమయానికి అక్కడ లేడు.

× × ×

దీనంగా రూములో కూర్చుని ఆలోచిస్తున్నాడు శ్యాం. ఇంతలో తలుపు దగ్గర చప్పుడయింది. తలపైకెత్తి చూసాడు.

ఎదురుగా చంచలత, 'మీరా' అన్నాడు అప్రయత్నంగా. ఆమె మాట్లాడలేదు, కుర్చీ

చూపిస్తూ శ్యాం 'కూర్చోండి' అన్నాడు. ఆ సమయంలో చంచలత తన రూముకు రావలసిన కారణమేమిటో శ్యాంకు అంతు చిక్కలేదు. 'థాంక్స్' అంటూ కూర్చుంది చంచలత.

ఒకటి, రెండు, మూడు, నాలుగు...మరి కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. శ్యాం తలవంచుకొని నేలవేపు చూస్తున్నాడు. ఏదో మాట్లాడాలనుకొంది, కాని మాట్లాడలేక పోయింది చంచలత.

'శ్యాంగారూ!' అంది తన హేండ్ బాగ్ తెరుస్తూ, శ్యాం తలెత్తి చూసాడు. బాగ్ లోని కవరు తీసి శ్యాం చేతి కందించింది చంచలత. శ్యాం హృదయవేదన ఎక్కువయింది. హృదయం స్పందిస్తుంటే అందుకున్నాడు. ఒకసారి చదివాడు, మళ్ళీ చదివాడు. 'ప్రేమలేఖ' గొణుగుకుంటూ విసురుగా చంచలతవేపు చూసాడు. ఆమె ఎప్పుడో వెళ్ళి పోయింది. శూన్యం వెక్కిరించింది.

అంతే! శ్యాం మరుచటిరోజు ఆ వూరు వదిలాడు.

× × ×

గట్టిగా శ్వాసపీల్చాడు మొదటి జవాను. 'తర్వాత' అన్నాడు రెండవ జవాను భాను కుతూహలంగా. సమాధానం—మౌనం.

'మాట్లాడవేం భాయీ?' రెట్టించాడు.

'కథ అంతే భానూ! అంతే.'

'మరి వేణు?' అడిగాడు భాను.

'అతను ఏదో శానిటోరియంలో హృగ్వేదంతో మరణించాడట' అన్నాడు మొదటి జవాను.

'శ్యాం సంగతి?' తిరిగి ప్రశ్నించాడు భాను.

'వేణు పేరున ప్రేమలేఖ వ్రాసి అతని జీవితాన్ని నాశనం చేసిన శ్యాం నేనే భానూ, నేనే' 'దుఃఖం పొంగి వస్తూంటే గట్టిగా రోదించాడు.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.